తెరచాప దించిన పడవ

శెలవులకి పై వూళ్ళు వెళ్ళి వచ్చింతర్వాతనే మనం నిజంగా విశ్రాంతి పొందడం జరుగుతుందిట. ఈ సందర్భంలో అలానే జరిగింది. మామయ్యకి మరో వూరికి బదిలీ అయింది. ఆ మధ్య శెలవులకి ఆ కొత్త ఊరెళ్ళాను. పిల్లలకి తండ్రివైపు వారి మీదకంటె తల్లివైపు బంధువులపట్లనే ఎక్కువ చనువు, ఆపేక్ష వుంటాయంటారు. మామయ్యపట్ల ఇది వర్తించదు. తండ్రివైపు చుట్టమే. నాకు చాలా చనువు ఎందుకో తెలీదు. వితర్కిస్తే చాలా కారణాలగపడతాయి. ఆయనా, అత్తయ్యా అన్యోన్యంగా వుంటారు. ఆవిడ సణుగుళ్ళని ఆయన నవ్వి పారేస్తాడు. ఏ చిక్కు వచ్చిపడినా చికాకుపడదు. ఆయనకి జబ్బు చెయ్యడం ఎవ్వరం ఎరగం. ఆధునిక యుగంలో రక రకాల జబ్బులు, మానసికం, శారీరకం వచ్చిపడుతున్నాయి. వాటిని రూపుమాపే పరిశోధనలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. ఇవేవి ఆయనకి సంక్రమించనందుకు ఆయన్ని ఒక అపూర్వ వ్యక్తిగా పరిగణించినా అతిశయోక్తి కాదేమో ! డాక్టర్లు, లాయర్లు, పోలీసులు, వీరి చేతుల్లో పడకుండా జీవితం గడిచిపోవాలని ఆయన నిర్వచనం. ఆయనంటె నాకెందుకిష్టమో చెప్పలేను. కూడనిపని చేసినా, మాట అన్నా, తీర్పు చెప్పడు నవ్వుతాడు అది కేవలం పెదవులమీద బలవంతంగా అమర్చిన మందహాసం కాదు. జీవితంపట్ల మనస్సులో పాతుకుపోయిన ఒక దృక్పథం పెదవులమీద విడిచేసిన 'మాయ' అనబుద్దేస్తుంది. చుట్ట కాలుస్తో, జీవితాన్ని తిలకించి నవ్వుతాడు. పొగ విడుస్తాడు. అది గుండ్రంగా విడి, పెద్దదయి, పెరిగిపోతున్న విశ్వంలా 'అనంతం' లోకి వ్యాపించి మాయమౌతుంది. మళ్ళా నవ్వుతాడు

"ఎందుకు మామయ్యా నవ్వుతున్నావు?"

"చుట్ట ఆరిందిరా- అంకెళ్ళు పడిపోతున్నా పొగ రావడంలేదు."

ఏదో గంభీరమైన ఆలోచనాపరంపరం నుండి ఆ నవ్వు వికసించిందీ అనుకోడానికి లేదు. తీరాచేసి చుట్ట ఆరిపోయిందట! ఒక్కొక్కసారి జీవించడం అంటే ఏమిటోతెలీని- వూరికే తిండితిని, వూపిరితీసే- ఒక సాధారణ యంత్రంలా కనిపిస్తాడు. ఉద్రేకాలు, క్రోధాలు, బాధలు, సంఘర్షణలు, గాఢంగా వాంఛించడాలు, ఆదర్శాల పెత్తనం,శీలం పోగొట్టుకోవడం వగైరా ఆధునిక తత్వం ఆయనమీద ఏ కసరత్తూ చేసినట్లులేదు. కాబట్టి నిండైన జీవితం కాదేమో అనుకునేవాడిని. లేకపోతే అవన్నీ జరిగి, మిగిలినమనిషి ఇలా తయారయ్యాడేమో! నాకు తెలీదన్నానుగా. ఓమారు అడిగేశాను- లౌక్యంగా.

"ఏం మామయ్యా! గొడవలు, ప్రమాదాలు నీకేమి జరగలేదా?"

"ఎందుకు జరగలేదురా! గవర్నమెంటు ఉద్యోగిని అవేవీ తాకవు, పదేళ్ళు గీతవల్లెవేస్తే అబ్బని నిబ్బరం, పదినెల్లు గవర్నమెంటు ఉద్యోగంలో అబ్బుతుందిరా అబ్బీ."

కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌వారి ఆధ్వర్యాన కొత్త భవనం నిర్మిస్తున్నారు ఊరవతల- దాని నిర్మాణ కార్యక్రమం మామయ్య చూస్తున్నాడు. చూసొద్దాం రమ్మనమంటే బైలుదేరాం.

చాలా చిన్నవూరది. ఇరవైయేళ్ళక్రితం ఓ పాతిక గుడిశెలుమాత్రం ఉండేవిట. అంతా అడివిలా పెద్దపెద్ద చెట్లు, గుట్టలు, రాళ్ళు, కొండలు మధ్యమధ్య చదునైన ఎర్రనేల- కాస్తమేర దుబ్బులా మొలిచిన పచ్చికబైలు, విరుద్ధమైన శీతోష్ణస్థితులను సూచించే భూభాగం,

ప్రకృతి దృశ్యం అక్కడ కలిసి వున్నాయి. దూరంగా కొండలమధ్య చిన్న సరస్సు, మళ్ళా చదునైన నేల, రెండుమూడు ఫర్లాంగులివతల నాలుగైదు గుడిసెలు. వాటికీ ఓ ఫర్లాంగు గివతలగా స్థలం సేకరించి, ప్రభుత్వంవారు కమ్యూనిటీ హాల్ కట్ట సంకల్పించారు. కాని ఒక పేచీ వచ్చింది. వారికి కావాల్సిన స్థలంలో కుడివైపు మూలగావున్న భాగం- పెద్దగుడిసెలో వుండే వృద్ధురాలు, విదురమ్మది. ఏదో కొంత ముట్టచెప్పి, ఆ కాస్త స్థలమూ తమ స్థలంగా చేసుకొని అందులో కొత్తభవనం నిర్మిద్దామని బ్లాక్ అధికారులు పునాదులు తవ్వి కట్టడం ప్రారంభించారు. ఇందుకు విదురమ్మ ఒప్పుకోలేదు. తీరా చేసి అది నాలుగైదు గజాలనేల, ఆమీద రెండు పెద్దరాతిబండలు, వాటి నడుంగా ఒక చెట్టు వున్నాయి. ఆ చెట్టు కొట్టించి కలప ఆమెకే ఇచ్చి వేస్తామన్నారు. కావాలంటే ఆ రాతిబండలు కూడా తవ్వించి, ఆమె భాగంగా ఉంటున్న చుట్టుస్థలంలో వేయిస్తామన్నారు.

విదురమ్మ అంగీకరించలేదు. సంప్రదింపులకి మామయ్యని పంపారు. ఆమె వల్లకాదంది. కారణం మాత్రం చెప్పదు. చుట్టుపక్కల గుడిశెలలో ఆమె స్నేహితురాండ్రచేత చెప్పించి చూశారు. అక్కడి భూమికి వున్నధరకంటే అదనంగా ముట్టచెపుతామన్నారు. ససేమిరా వీల్లేదంది. మా మామయ్య 'ఇదంతా అవకాశం దొరికినప్పుడు ముసలాళ్ళు చలాయించే అధికారచిహ్నం. ఇదొక నాటకం. చివరికి ఒప్పుకు తీరుతుంది. మరేం ఫరవాలేదు. నా పూచీమీద కానియ్యండి.' అని కట్టడం పని కొనసాగించ మన్నాడు. పని ప్రారంభించారు.

ఇది తెలుసుకొని విదురమ్మ అక్కడినుంచి ఎక్కడికో వెళ్ళిపోయింది. ఎవరితో సంప్రదించడం? వాకబుచేశారు. విదురమ్మ కొడుకు ఎక్కడో ఉత్తరహిందూస్థానంలో ఉన్నాడుట. ముప్ఫైఏళ్ళుగా వెళ్ళాడుట. మళ్ళా అజాపజా లేదు. ఒక కూతురుంది. భర్త కలపవ్యాపారంట. యుద్ధం రోజుల్లో వారు రంగూన్ వెళ్ళిపోయారు. రాకపోకలు, ఉత్తర ప్రత్యుత్తరాలు పాతికేళ్ళుగా లేవు. మొదటి ప్రపంచయుద్ధం రోజుల్లో యుద్ధంలోకి వెళ్ళిన భర్త భద్రన్న యుద్ధం ముగిసిన రెండేళ్ళు డబ్బు పంపుతూ, వచ్చి తీసుకెడతానని జాబులు వ్రాస్తూండేవాడుట. తరువాత ఆ జాబులు నిలిచిపోయాయి. భర్తది మూడెకరాలభూమి ఈమెకి సంక్రమించింది. మహజర్లుపెట్టుకుని, రెండేళ్ళు అధికారులతో మొరెట్టుకున్నాక, ఒక తాశీల్దారుగారి కనికరంవల్ల, నెలకి పదిరూపాయలు ఈమెకి ముట్టచెప్పే ఏర్పాటు జరిగింది. ఆ నేలలో ఇల్లువేసుకుని, పాలుసప్లయ్ చేస్తూ కాలక్షేపం చేస్తోంది. అది విదురమ్మ పూర్వచరిత్ర.

బెదిరించడం, లాలన, బ్రతిమాలడం- ఇవన్నీ జరిగాయి. మామయ్య నవ్వుతాడు. నిజానికి ప్రభుత్వం పూనుకున్నాక, విదురమ్మ అనుమతిఅంటూ అవసరంలేదు. అయినా, మంచిగా ఏదో కాస్త ముట్టచెప్పి ముసలిదాన్ని సంతోషపెట్టడమే అధికారుల ఉద్దేశం. ఆవిడ కాదనడంతో ఉభయత్రా కాస్తంత రోషాలు మొలకలెత్తాయి.

నేను మామయ్యతో పనిమీదకి వెళ్ళినరోజే, విదురమ్మ తిరిగి తన గుడిశెలోకి వచ్చిందట. ఇద్దరం ఆమె ఇంటికే బైలుదేరాము. సాయంత్రం నాలుగైందేమో, గుమ్మంముందు పెద్ద రాతిబండలు, వాటి నడుంగా ఉన్న నీడలు, గుమ్మంముందు పందిట్లోకి సాగాయి. ఆ పందిరి కింద నులకమంచం మీద పరుంది విదురమ్మ. దక్షిణంవైపు, మూలగా గేదెలు కట్టేసున్నాయి. పాలేళ్ళు ఏదో సవరిస్తున్నారు. పశువులవాసన మమ్మల్ని ఆవరించింది. పేడ, పిడకలు, ఎండుగడ్డి, చుట్టపొగ చూరుమీంచి

పొయ్యిపొగ, నులకమంచం, పలుపు, చెంబు, ఆ వాసన, 'భారతభూమి' అంటే ఇవే స్మరణకొస్తాయి నాకు. నులకమంచంపైన రోజాయిమీద పరుంది విదురమ్మ. మమ్మల్ని చూసి నవ్వింది. కాని లేవలేదు. నవ్వుకోసం పెనుగులాడుతున్నట్లు మడతలుపడి, చర్మం ఎముకల్ను పీడిస్తున్నట్లగపడే మొహం ఆమెది. ఒడిలిన జామపండు ఛాయ, జుట్టంతా నెరిసింది. ఎక్కడా రాగివెంట్రుకకాని, ఏకాంతజీవిగా నలుపు వుంచుకోగలిగిన ఒక్క వెంట్రుకా లేదు. కనుబొమ్మలు కూడా అదేరంగు. ఎండకి బీటలు తీసిన ఎడారినేల. వర్షానికి చటుక్కుని దగ్గరగా జరగడంలో నొక్కుకుపోయినట్లు పల్చటి పెదవులు- వాటివెనక పరీక్షగా చూస్తే కాస్త మెరుపు మిగుల్చుకున్న పళ్ళ వరసమీద మసకగా కదిలే నవ్వు. తుఫానంతా అణగారిం తర్వాత ఎక్కడ నుంచో దోవతెలీక వచ్చిపడ్డ తెల్లమేఘంలా. సూర్యగ్రహణం జరిగినప్పుడు ఒడిలి జారిన రావాకులా చెవులు, వాటిల్లో లవంగాలు, తెల్లచీర, తెలుపు కాస్తమాసిన తెలుపు. మూసుకున్న శరీరఛాయలో కలిసిపోయింది. ఆమె మొహాన ఎన్ని ముడుతలున్నాయో, ఆ చీరని అన్ని ముడుతలూ ఉన్నట్లనిపించింది. చూచేవాడు యువకుడైనప్పుడు వార్ధక్యం అంతగా అగపడుతుందంటారు. నా కట్లాగనిపించింది. ఫోటోలు తీసేవాళ్ళు 'ఒక వృద్ధస్త్రీ' అన్న ఫోటోని ఎగ్జిబిషన్‌లో ఎందుకు పెడతారో తెలిసింది నాకు. శిల్పులు, చిత్రకారులు, వార్ధక్యాన్ని ఎందుకు చిత్రిస్తారో తెలిసింది నాకు. అది స్వచ్ఛమైన, స్థిరమైన సౌందర్యం. దాని చిత్రణ స్వచ్ఛమైన కళ. యువకుడు ఎదుగుతాడు. మానసికంగా పెరుగుతాడు. మనస్సు శరీరాన్ని మారుస్తూ వుంటుంది. ఉద్రేకాలు కెరటాలలా లేచి శరీరం అనే నౌకని గెంటుతూ, ముంచి వేస్తూంటాయి. తేరుకుని, బైటపడేటప్పటికి శరీరంలో ఏం మిగుల్తుందో ఎలా తయారవుతుందో- వార్ధక్యంలో శరీరం మారదు. తన ఉద్రేకాలు ఏమీ చెయ్యలేవు. తపన, అనుభూతి దాన్ని కలవరపెట్టవు. స్వప్నం పీడించదు. అందుకనే స్వచ్ఛమైన సౌందర్యం అది.

తెరచాప దించివేసిన నౌక వార్ధక్యం. సముద్రం నడుంగా వుంటుంది. ఒడ్డుకి చేరడం అంటూలేదు. అసలది కదుల్తున్నట్టే స్ఫురించదు. అందుకే స్థిరమైన సౌందర్యం అది. అలా తేలిపోతూ వుంటుంది. ఎప్పుడో ఒకసారి బుడుంగుమంటుంది. ఇందుకే కాబోలు చిత్రకారులకి, శిల్పులకి, కవులకి, వార్ధక్యం అంటే అంత మోజు.

విదురమ్మ వయస్సు డెబ్భైపైనే అంటారు చుట్టుపక్కలవాళ్ళు- ఆమె మాత్రం అరవైతొమ్మిది మొన్ననే వెళ్ళిందంటుందిట, పక్కింటి పేరమ్మతో. వృద్ధులకు వయస్సుంటూ వుండదు. ఉన్నా ఎవ్వరూ పట్టించుకోరు. తోటివారిలో సమవయస్కులుతప్ప.

"ఏం విదురమ్మా ఏం తేల్చావ్?" అన్నాడు మామయ్య- నవ్వుతూ.

ఆమె నవ్వింది.

"మీరేం తేల్చారు?"

నాకూ నవ్వొచ్చింది. విదురమ్మకి నేనూహించుకున్నంత చెముడు లేదు.

"మేం పని ప్రారంభించాంగా- గోడలు లేస్తున్నాయి."

"మీ గోడెవరిక్కావాలైండి?" అంది విదురమ్మ, నావైపు చూస్తూ. ఆ చూపులో కొంచెం కొంటెతనం వుందేమో.

"మాక్కావాలి గనకనే- ఇంతగా నిన్ను బ్రతిమాలుతున్నాం."

"అమ్మో- ప్రభువులు, మీరు బ్రతిమలాడ్డమే! మిమ్మల్ని నేను బ్రతిమలాడాలి"

అంది మాటలు తీరికగా ఉచ్చరిస్తూ. ఒత్తులు మినహా మిగతావన్నీ స్ఫుటంగానే అంటోంది. ఆమె చదువుకోలేదు, పాతకాలపుది.

"ఇంతకీ ఈ నాలుగడుగుల నేలా లేకపోతే నీకేం లోటు?" అని అడిగాడు మామయ్య.

"ఆ నాలుగడుగులు విడిచేసి మిగతాదంతా తీసుకుపొండి ప్రభువులు– నాకిష్టమే" అని విదురమ్మ దగ్గుకోసం లేచికూర్చుంది. కంఠంచుట్టూ– తన చేతులు బిగించి దగ్గుతోంది.

"ఈ నాలుగడుగుల విశేషమేమిటో అడగవచ్చా?" అన్నాను ధైర్యం తెచ్చుకుని. నాకు మరీ పెద్దవాళ్ళతో మాట్లాడ్డం భయం. వారికి మనం అడిగిన ప్రశ్న అర్థం కాదనీ, ఓ వేళ అర్థమైనా అడిగిన ప్రశ్నని బట్టి, మనం ఎట్లాంటివాళ్ళమో విలువకట్టి నిర్ణయించి, 'ఓస్, ఇంతేనా?' అని నవ్వుతూ తీసిపారేస్తానని– ఏదో భయం. వాళ్ళకి మతిమరుపు జాస్తి, మాట్లాడ్డం మొదలుపెడితే, వారి పాత గొడవలతో విసిగిస్తారనీ, మన వ్యాఖ్యానం, సానుభూతి కోరని వ్యక్తి ప్రకర్షగా పరిణమించే స్వగతంతో ఇబ్బంది పెడతారనీ– ఏవేవో అనుకుంటూ ఉంటాను.

తీర్చిన పొడగాటివేళ్ళు– చెవులచుట్టూ రేగిన దట్టమైన ఉంగరాల జుట్టుని పక్కకి తొలగించింది. చేతులకి, మెడలో ఎక్కడా ఆభరణాలు లేవు. గణితశాస్త్రంలో తిన్నటిగీత సూత్రాన్ని అతిక్రమించి వంకరలు తిరిగినట్లుగా వుంది ఆమె.

దగ్గునుంచి తేరుకుంది. ఆయాసంతో వూగిసలాడుతున్న గుండెలను అదిమి పట్టుకుంది. ఆమె కళ్ళు మూతలు పడుతున్నాయి, సముద్రకెరటం లుంగదీసి లోపలికి మడిచేసిన చందమామ ప్రతిబింబంలా. చెట్లవెనక దిగుతున్న సూర్యుడి ఎర్రకిరణం ఆమె నుదుటిమీద ఎర్రబొట్టులా– గణిత శాస్త్రంలో తిన్నటిగీతలా పడింది. నాకేసి తలెత్తి చూసింది. తల కదపడం– ఒక పాత్ర అభినయించడంలో గల తీక్షణమైన కార్యం– శిలాప్రతిమ కదిలినట్లు గతం దిగవిడిచిన ప్రతిమ.

నవ్వింది– భూకంపం వెనక విధ్వంసక శక్తి నేలపైకని బైలుదేరి, సిగ్గుపడి లోపలికెళ్ళి తమాయించుకున్నట్లు కనపడే నవ్వు ఆమెది. అది పెదవులమీద నవ్వుకాదు. పళ్ళల్లో మెరిసేది కాదు. చర్మం మడతల్లో మరుగుపడ్డ నవ్వుకాదు, కళ్ళవెనక మసకగా మెదిలే నవ్వుకాదు. ఇవన్నీ కలిపి, నవ్వు దేవతంటూ వుంటే– మనస్సులో దాగిన ఆ దేవతను బైటకు తెచ్చి, ముసుగుతీసి పల్లకిలో కూర్చోపెట్టినట్లూ ఒక వాతావరణాన్ని నెలకొల్పే నవ్వది.

"అటు చూడండి అంది."

మేం, అటూ ఇటూ చూస్తున్నాం.

"నా తిన్నగా....."

ఆమె తిన్నగా రెండు రాళ్ళు, ఒక చెట్టు వున్నాయి. ఒక బండ నాలుగడుగుల ఎత్తుంటుంది. రెండోది కొంచం పెద్దది. మరో రెండడుగులుంటుంది.

"ఆ పెద్దది ఆయన– చిన్నది నేను, మళ్ళా నవ్వుతోంది. కానీ కళ్ళల్లో తడి సంధ్యలో రక్తంచుక్కలా, నవ్వులో కలిసి తళుక్కుమంది.

"అక్కడే కూకునేవాళ్ళం. పదాలు పాడేవాడు. పేపర్లు చదివి వినిపించేవాడు, నలభై ఏళ్ళనాటిమాట. ఇదంతా అడవి: అమ్మాయికి రెండో ఏడు. మంచంమీద

పరున్నాం. చలిరోజులు, పక్కన కుంపటుంది. ఓ రాత్రివేళ చిరుతపులి గభాలున వచ్చింది గదిలోకి. నా పాదం కరుచుకుంది. మంచంమీద నుండి లాగింది. కాలే కుంపటి నెత్తికొట్టాను. పట్టు విడిచి పరుగెత్తింది." విదురమ్మ తన పాదంకేసి చూపింది. చిరుతపులి కాట్లు మాని మడతపడ్డ చర్మం ఇంకా కనబడుతూనే ఉంది. ఆమె ధైర్యసాహసానికి లోలోన అభినందించాను. అయితే ఇదంతా ఎందుకు చెబుతున్నట్లు?

"నువ్వు చాలా ధైర్యసాహసాలు గలదానివి. కూతురుకోసం అంత త్యాగం చేశావు- ఇప్పుడు ఈ ఊరు అభివృద్ధికోసం యీ కాస్త త్యాగం చెయ్యకూడదూ? చూడు- ఓ ఏడాదిలో ఎలక్ట్రిక్ దీపాలొస్తాయి. ఇక్కడో స్కూలు పెడతారు. లైబ్రరీ, పిల్లల ఆటస్థలం, ఈతలాడడానికి చెరువు, ఉపన్యాసాలు, నాటకాలు జరుపుకోవడానికి పెద్ద భవనం- ఈ ఊరు స్వరూపమే మారిపోతుంది- నువ్వు 'ఊ' అంటే" అన్నాడు మామయ్య ఉపన్యాస ధోరణిలో.

"అదొక్కటి అడగమాకండి. నా ధైర్యాన్ని తెగ మెచ్చుకొనేవారాయన. చాలా పిరికాయన. అందుకనే యుద్ధంలో చేరాడు." అని మళ్ళా మొదలుపెట్టింది విదురమ్మ. మామయ్య, నేను బిగ్గరగా నవ్వుతున్నాం.

"పిరికోడినని అస్తమానం దెప్పేదాన్ని. ఓసారి ఏం జరిగిందో తెలుసాండీ? అలా ఆ చెరువుకేసి నడిచివెళ్ళాం. నీళ్ళలోకి దిగాను, తను దిగడు. ఈత రాదు, భయమంట. "పిరికోడా" అని ఆడిపోశాను. మనిషైతే ఎర్రగా వుండేవాడు. బక్కోడా అన్నాను. సన్నంగా ఉండేవాడు. 'బక్కోడా' అనొద్దని కసిరాడు. బలశాలంట. చూపెట్టమన్నాను. ఏది పడితే అది చేస్తానన్నాడు. చెరువు ఒడ్డున పెద్ద రాతిబండలున్నాయి. వాటిమీద బట్టలుతికే దాన్ని. ఆ బండలు మన లోగిలికాడికి తీసికెళ్ళగలవా అన్నాను. 'ఓ' అన్నాడు. కానీమన్నాను. ఆ రెంటివీ దొర్లించుకొంటా, ఒగుర్చుకుంటా, నాలుగు గంటలపాటు ఐరానా పడి, రాత్రి పడేసరికి ఇంటిముంగలికి చేరేశాడు. "దొర్లించడమేగా! ఏం గొప్ప" అన్నా. "తీసుకెళ్ళగలవా అన్నావు గాని, మోసికెళ్ళగలవా?" అనలేదుగా అన్నాడు. ఆ బండలమీద కూర్చుని తెల్లవార్లు నవ్వుకున్నాను. ఆ పెద్దబండ, ఆ ఎర్రటిది లేదూ అది ఆయన. చిన్నది నేను. అది తీస్తారా మమ్మల్ని చంపుకున్నట్లే" అంది విదురమ్మ. మళ్ళా దగ్గుతోంది. జ్ఞాపకాల బరువుతో మంచం బద్దీమీద వాలిపోయింది. మేం మాట్లాడలేకపోయాం. పాలేళ్ళు వచ్చారు. ఆమెను లోపలికి తీసుకెడుతున్నారు. "చూడు, విదురమ్మా- నువ్వు ఇంతగా చెబుతున్నావు కాబట్టి, ఈ నేల, రాళ్ళు వదిలేసి వేరే స్థలంపైన భవనం కట్టించే ఏర్పాటు చేయిస్తాను. నువ్వు బెంగపెట్టుకోవద్దు" అన్నాడు మామయ్య అడుగులువేస్తూ.

"ధర్మప్రభువులు కనికరించండి" అంటూ పాలేళ్ళ రెక్కలమీద లోపలికెళ్ళింది. మేం ఇంటికొచ్చేశాం.

"స్థలం వదిలేసినట్లే కదా మామయ్యా?" అన్నాను దోవలో.

"ఏమోరా- ముసలాళ్ళకి పట్టెక్కువ. మనం కావాలని పట్టుపడితే ఇవ్వనంటారు. వాళ్ళ ఉనికిని లోకానికి తెలియచేసే మార్గం పెంకిపట్టేగా! వద్దులే అంటే "కాదు, కాదు ఆ స్థలం తీసుకోండి బాబూ" అంటుందేమోనని అలా అని చూశాను. కానిది మొండిఘటం. ఆ బండలు గతించిన జీవితానికి చిహ్నాలు. వాటిపట్ల మమకార ముండటం సహజమే. రెండే మార్గాలు మనకి. ఆ బండల్ని మరో చోటికి జరిపించి,

ఆ చెట్టు కొట్టించేసి మనం స్థలం స్వాధీనం చేసుకోవడం ఒకటి, ఆ స్థలం విడిచేసి, తూర్పువేపు కొంత భూమిని సంపాదించి అక్కడనుంచి పునాదులు త్రవ్వడం రెండోది. ఇప్పుడింకా ప్రారంభదశలో వున్నాం గనుక, ముసలిదాని చరిత్రంతా వ్రాసి, ఈ స్థలం విడిచివేద్దామని సిఫార్సు చేస్తూ రేపే వ్రాస్తాను పైవాళ్ళకి" అన్నాడు. అలాగే వ్రాశాడు ఆ మర్నాడు.

ఆ సాయంత్రం ఏమీతోచక నేను విదురమ్మ గుడిసె దాటి కొండల మధ్య చెరువుకేసి నడుచుకుంటూ వెళ్ళాను. అక్కడ ప్రశాంతంగా ఉంది. చిన్నప్పుడు విదురమ్మ భర్తతో స్నానానికొచ్చిన దృశ్యం వూహించడం నావల్ల కాలేదు. చిన్నవాళ్ళు వృద్ధులైంతర్వాత, వృద్ధులు చిన్నవారుగా ఉన్నప్పుడు ఎట్లా వుంటారో వూహించుకోవడంలో ఏదో తృప్తి కనబడుతుంది. ముఖ్యంగా మనం వృద్ధులం కానప్పుడు, మనకున్న వయస్సుకంటే ఓ ఇరవైయేళ్ళు తర్వాతకాని వార్ధక్యం రాదేమోననిపిస్తుందట. ఒకటి రెండు కప్పలు నీళ్లల్లోపడ్డాయి. ఒడ్డునున్న రాళ్ళరంగే వాటిదీను. సూర్యుడు కొండవెనుక దిగుతున్నాడు. ఆ దృశ్యానికి వయస్సులేదు, కాలం లేదు. మనిషికే ఈ రెండూను.

వెనక్కి తిరిగాను. గుడిసెలకేసి నడుస్తున్నాను. పాలమనిషి పేరమ్మ కనిపించింది. పలకరించాను. విదురమ్మ ఒంట్లో ఎట్లా వుందన్నాను.

"దానికేం తెగులు. పదేళ్ళుగా అట్లానే వుంది. ఇంకో పదేళ్ళ వరకూ భయంలేదు" అంది పేరమ్మ. రాగిరంగు జుట్టు, ఎత్తైన మనిషి, ఆభరణాలు లేవు– మెడలో అరంగుళం వెడల్పు బంగారుపట్టీ తప్ప.

"పాపం, ఆమెని చూసేవారెవరూ లేరుకదూ?" అన్నాను. పేరమ్మ నవ్వింది.

"దానికేం లోటు. పాలమీద పాతికో, పరకో ముట్టుతుంది. గవర్నమెంటోరు సాలీనా వందరూపాయలిస్తారు."

"మనుషుల ఆసరా– ఆదుకొనేవాళ్ళు వుండాలిగా" అన్నాను.

"మమ్మల్ని పూసుకుతిరుగుద్ది. కొడుకు, కూతురు పట్టించుకోరు పాపం."

పాకల దగ్గిరికి చేరుకున్నాం.

"ఈ బండల్ని చూసుకుని, భర్తతోగడిపిన రోజులు స్మరించుకుంటూ కాలక్షేపం చేస్తుంది కదూ?" అన్నాను.

"ఆ కథ ఎన్నిమార్లు చెప్పిందో– అదో వెర్రిలెండి."

"నువ్వామెను చిన్నప్పుడు ఎరుగుదువా?"

"నేను పదేళ్ళుగా ఎరుగుదు. మొగుడు సావలేదు– ఎప్పుడో తిరిగి వస్తాడు అంటూ వుండేది, మేం వచ్చిన కొత్తలో. ఆడొచ్చేతలికి, ఎళ్ళినప్పుడెట్లా వుండేదో గదంతా అట్లాగుండాలిట. బల్ల, కుర్చీ, మంచం ఎవో పుస్తకాలు, ఒక బాకు, పులిచర్మం ఇవన్నీ మొగుడున్నప్పుడు మాదిరిగా రోజూ సర్దుతూ, ఆడున్నట్లుగానే సంబరపడేది– రండి చూద్దురిగాని" అంది పేరమ్మ. రాతిబండలముందు గుడిసె దాటి దొడ్డివైపు వెళ్ళాం. అక్కడ ఓ పెంకుటిల్లుంది. దానికి రెండు గదులు, ఓ గదినిండా బస్తాలు, గడ్డి, పాతసామాను, మాసినబట్టలు, కర్ర, కంప వున్నాయి. రెండో గది తలుపు మెల్లగా తోసింది పేరమ్మ. బల్ల, పాతకుర్చీ, రంగం కర్రపెట్టి గోడని పెద్దబాకు, అరంగుళం మందంది ఓవర్ కోటు, మోకాళ్ళవరకూ వుండే తోలుబూట్సు, టోపీ, బల్లమీద పుస్తకాలూ వున్నాయి. ఇవన్నీ భర్త యుద్ధంలో చేరిన రోజుల్లోవి. బల్లమీద చిమ్నీదీపం. తుపాకులు

చిత్రాలుగా గల లాంప్‌షేడ్- దానిమీద "భద్రం" అన్నపేరు భర్త- అక్కడ కూర్చుని చదువుకుంటున్నట్లుగా ఊహించుకుంటుందిట విదురమ్మ. రోజూ గదంతా శుభ్రం చేస్తుందిట. అతనున్నప్పుడు ఎట్లావుండేదో అట్లా వుంచుకోవాలనిట. పుస్తకాలు చూశాను. సైనికుల విధులు దినచర్య గురించిన పుస్తకం ఒకటుంది. మరో పుస్తకం ఓడమీద ప్రయాణీకులు గమనించవల్సిన నిబంధనలగూర్చి. గోడని ఒక పాతఫొటో వుంది. ఫ్రేమ్‌ని పురుగులు తినేశాయి. మొహాలుకూడా స్ఫుటంగా కనబడ్డంలేదు. భర్త సైనిక స్నేహితులతో తీయించుకున్న ఫొటో అది. అందులో భద్రయ్య ఎవరో, పేరమ్మ చెప్పలేకపోయింది.

"విదురాన్ని అడిగా 'మొగుడ్ని చూపవే' అని. ఓ సిగ్గు! నవ్వుద్ది. మొగుడేనని వేలుతో నడుంగావున్న మనిషిని చూపింది. మరోపాలి నా మరిది అడిగితే- 'యీ చివరివాడు' అని చివరిమనిషిని చూపింది. దానికి మతిమరుపు, మొగుడెవడో తనకే తెలీదు" అని పేరమ్మ నవ్వింది.

ఏనాడో తీసిన ఫోటోలో మనుషుల్ని పోల్చడం అంత సులువు కాదు. పైగా వారు సైనికుల దుస్తులలో వుండడం వల్ల అందరికీ సమంగా మీసాలు, టోపీలు, కోట్లు వుండడంవల్ల అంతా ఒకలాగే వుంటారు.

"మొగుడితో కాపరం, ఐదారేళ్ళే కదటండీ, అదికూడా ఏడాదికో పాలి శెలవుమీద వచ్చి, ఓ పదిరోజులుండి పోయేవాడుట. తర్వాత సావనే చచ్చాడు. లేదు ఎక్కడో వున్నాడు వస్తాడంటూంది. పిచ్చిది" అన్నది పేరమ్మ. విదురమ్మపట్ల ఒక వింతసానుభూతి పొడసూపింది నాలో. విక్టోరియారాణి జ్ఞాపకానికొచ్చింది. కాలేజీలో మాకామె జీవితచరిత్ర పాఠ్య గ్రంథంగా వుండేది. ఆమె భర్త మరణించిన తర్వాత కొన్ని సంవత్సరాలపాటు దుఃఖంలో మునిగిపోయి భర్తవుండే గది, సజీవుడై ఉన్నప్పటిలాగు రోజూ సర్ది అమరుస్తూ, గతాన్ని ఆరాధిస్తూ గడిపేదట. ఈనాటికి మానసిక శాస్త్రజ్ఞులు యీ అనుభూతిని అనారోగ్యకరమైందిగా "మార్బిడ్" అని ఖండిస్తారు. ఈ అనుభూతితో వైరాగ్యం, ఆధ్యాత్మికం- ఎంతవరకూ కలిసివున్నాయో నాకు తెలీదు. ఏదో ఒకరకం మానసిక ప్రశాంతత అందులో లేకపోతే, విదురమ్మలాటివాళ్ళు ఆ ఆరాధనాభావానికి లొంగిపోరనుకుంటా.

భర్తపట్ల ఎట్లాంటి భావంవుందో విదురమ్మ మనస్సులోకి జొరబడి చూడాలని వుంటుంది. కాని అది సాధ్యంకాదు- ఎవరి మనస్సులో వారే జొరబడలేరు! ఇంటికొచ్చేశాను. రాత్రంతా కలతనిద్ర.

మర్నాడుదయం చాకలి తమ్మయ్య వచ్చాడు. నావీ, మామయ్యవీ బట్టలుపడేసి నేనే పద్దు వ్రాస్తున్నాను. మూటకట్టి తలమీదకెక్కించి గుమ్మం దిగుతూ, విదురమ్మ పంపిన సందేశం వినిపించాడు చాకలి. బండలు మరో మూలగా జరిపి ఆ స్థలం వాడుకోవచ్చునని కబురు- ఎటొచ్చీ వాటి నడుంగావున్న ఆ చెట్టుమాత్రం అలాగే ఉండాలిట. మామయ్య నవ్వి సరేలే వెళ్ళమన్నాడు. చెట్టుకొట్టి తీరాలి పునాది అక్కడిదాకా తవ్వాలిట. "ముసిల్ది ఇంకా మడతపేచీ వేస్తూనేవుంది స్మా!" అన్నాడు మామయ్య.

"ఏమిటో ఆ చెట్టులో విశేషం?" అన్నాను. మామయ్య ఆది మానవుల ఉదంతం చెప్పుకొచ్చాడు. ఆదిమానవులు వృద్ధులను బ్రతకనిచ్చే వారుకారట. వృద్ధుడయ్యాడని నిదర్శనం దొరకగానే పిన్నలంతా ఏకమై ఆ వృద్ధుడిని హతం చేసేవారుట.

ఇప్పటికీ ఆఫ్రికాలో అడవిమనుషులు, తెల్లదొరని కలుసుకుంటే జుట్టు నల్లబడేరంగు ఇప్పించమని ప్రాధేయపడతారుట. తెల్లవెంట్రుక కనబడగానే వృద్ధుడయ్యాడని చంపుతారన్న భయమట. కొందరు వృద్ధులు ఒకరకం పరీక్షకి తట్టుకోవాలిట. వారిని ఒక చెట్టు ఎక్కమంటారుట. కొమ్మలకి తాళ్ళుకట్టి లాగుతారు. ఆ వూపికి తట్టుకుని నిలబడినవారిని విడిచేస్తారు. పడిపోయినవారు పనికిరారు. నటుడు వృద్ధుడయ్యాక ప్రేక్షకులు "ఇంక వీరు మానుకోవచ్చు" అంటారు. అనగా అతన్ని చెట్టెక్కించి వూపితే పడిపోయాడన్న మాట. తోటివారు "ఈమె ఒకప్పుడు అందంగా వుండేది" అన్నారంటే ఆ లావణ్యవతిని చెట్టెక్కించారన్నమాట.

"విదురమ్మ ఆ చెట్టు తనెక్కనంటుంది పడిపోతానని తెలుసు. మరొకర్ని ఎక్కనివ్వదు" అంటూ మామయ్య నవ్వుతో వ్యాఖ్యానం ముగించాడు.

తోచక మళ్ళా అటుకేసి బైలుదేరాను. గుడిశలు, బండలు వాటి మధ్య చెట్టు దాటాను. అదొక పెద్ద చెట్టు. ఆకులన్నీ వూడిపోతున్నాయి. బెరడుమీద వెడల్పాటి పగుళ్ళు కనుపిస్తున్నాయి. ఓపికలేనట్లు కొమ్మలు వంపులుతిరిగి ఆకాశంలోకి కాక భూమికేసి వంగి వున్నాయి. అదేరకం చెట్టూ ఎంతకాలం ఉంటుందో నాకు తెలీదు– కానీ దాని పనైపోయిందని తెలుసు. ఆ రాళ్ళమధ్య బిగిసి నిలబడింది గాని, వాటిని తొలగిస్తే కూలిపోతుందేమోననిపిస్తుంది. చెట్లవ్రేళ్ళు నేలమీద పాకాయి. కాని వాటిపట్టు లేదు. పట్టుచిక్కక విడిచేసిన గుప్పిడిలాగ పట్టుకోసం కొనవూపిరితో నేలను పీడించి పెనుగులాడుతున్నాయి. అది కూలితే విదురమ్మ గుండె నిలిచి పోతుందా! ఆలోచనలో ముందుగా కొలనుకేసి వెడుతున్న చాకలి తమ్మయ్యని, గాడిదల్ని చూడనేలేదు. పలకరించాడు. తమ్మయ్య వృద్ధుడు. చుట్టలకి ఏమన్నా ఇవ్వమన్నాడు. ఇచ్చాను. విదురమ్మ గతం గురించి కదిపాను. భర్తని ఎరుగుదువా? ఎట్లా వుండేవాడు? ఆ చెట్టంటే ఆమెకి ఎందుకంత మమకారం?

"బాగా ఎరుగను గానండీ– ఓపాలి చూశాను జబ్బపుష్టి గలోడు. కండలు మెలికలుతిరిగి నల్లసిద్దిలాగు ఉక్కుతునక నిగనిగ– స్నానం చేస్తుంటే చూశాను. ఆడు పాతిన సెట్టే నీడకోసరం అల్లదుగో దిబ్బల కడనుంచి పెల్లగించి తెల్లవార్లు త్రవ్వి నీడకోసరం పాతినాడంట.

"ట, ట– అంటావు. నువ్వెరగవా?"

"ఒకటి రెండు పర్యాయాలు సూశానుగాని బాగా ఎరికలా. సెట్టుకింద ఆ బండలమీద కూకుండేవారు పరాసికాలాడుతూ. పిల్లల్ని రానిచ్చేది కాదు ఆటలకోసరం, లోగిల్లో సావాల్సిందే."

"ఎందుకో?"

"మరేం ఊసులాడుకునేవారో దైవంకెరిక– మరోళ్ళుండకూడదు. వంటిగా నడవడం పరుగులు, పదాలు, తానాలు...."

తమ్మయ్య తన్మయుడై నవ్వులో పడిపోయి వర్ణించటం మానుకున్నాడు ఏమిటో ముచ్చట్లన్నీ తనే స్వయంగా జరిపినట్లు! ఇంటికొచ్చానే గాని, ఆ రాత్రంతా ఓ సందేహం పీడిస్తూనే ఉంది. విదురమ్మ భర్తని స్మరిస్తూ ఎదురుగావున్నట్లు వర్ణించింది. తమ్మయ్య వర్ణిస్తూ నల్లసిద్దిలా గుండేవాడన్నాడు. ఇందులో ఏదో తిరకాసుంది. తమ్మయ్య నలుపు, ఇంకెవర్నీ ఎర్రగావున్నట్లు వప్పుకోడు కాబోలు. విదురమ్మ ఎరుపు– భర్త ఎరుపుగా

ఉంటేగాని అంత ప్రేమించదు– ఆమె కళ్ళకి ఎరుపుగా కనబడేవాడేమో. మనవాళ్ళలో ఎరుపు అన్నమాటకి అర్థంలేదు. దేనితోనో పోల్చి చూస్తే తప్ప అదొక సహజమైన రంగుగా నిలబడలేదు. ఎర్ర దబ్బపండు గులాబి, సంధ్య, బంగారం ఇలాగ వీటితో పోల్చి సమాధానపడ్డంకాని, వాటన్నిటికీ పునాదిగా వుండదగ్గ ఎరుపుఛాయకు అన్వయించేదేమో!

ఆ మర్నాడు మామయ్య చేసిన సలహాని ఖండిస్తూ, తీసుకున్న చర్యని విమర్శిస్తూ, పై అధికారుల దగ్గరనుండి కాగితం వచ్చింది. తను ఆ ముసలిదాన్ని బ్రతిమలాడ్డం తప్పన్నారు. ఏదో ముట్టచెప్పి, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధన ప్రకారం, ఆమె అనుమతితో నిమిత్తం లేకుండా నిర్మాణ కార్యక్రమానికి పూనుకోక జాప్యం చెయ్యడం పొరబాటన్నారు. ఒక ముసలిదాని జ్ఞాపకాలు గునుపుళ్ళుకంటే భావిపౌరుల సంక్షేమం ముఖ్యమన్నారు. పథకం అమలు జరపడంలో ఉద్రేకాలకి చోటు లేదన్నారు. జాగుచెయ్యక, కట్టడం ప్రారంభించమన్నారు.

మామయ్య నవ్వుతూ అన్నాడు.

"చూశావా అబ్బీ– ఈ ఉత్తరం పఠించిన తర్వాత, గీతాపారాయణ అవసరం అంటావా? ప్రభుత్వోద్యోగి, ఉద్రేకాలకి, అహంకి అతీతుడవాలి. దయాదాక్షిణ్యాలకి నిబంధనలు అమలు జరిపేవారు లొంగకూడదు. పనిమాత్రం జరగాలి! ఖర్మ కొనసాగించే యంత్రంలాంటివాడు ఉద్యోగి ఫలితాన్ని కూడా ఆహ్లాదంతో ఆశించకూడదు. చితికి నిప్పంటించాలి. కన్ను తుడుచుకోకూడదు. అంతే......"

"చెప్పు మామయ్యా భావాలు ఈ పూట మంచిపదునుగా పడు తున్నాయి," అన్నాను.

"ఉండుమరి చుట్టకి నిప్పంటించనీ."

"ఆ ముసల్ది భర్తని దైవంగా ఆరాధిస్తూ, ఆ ఆరాధనికి చిహ్నాలుగా ఆ రాతిబండలకు రాత్రింబవళ్లు మ్రొక్కుతూ బ్రతుకుతోంది. అదొక మధురమైన సెంటిమెంట్ అందమైన అనుభూతి. అందులో మానవత్వం వుంది. దాన్ని మన్నించి వుండనివ్వడమా? లేక దాన్ని ధ్వంసంచేసి వేలమంది పల్లీయుల వినోదానికి, వికాసానికి యీ బ్లాక్ భవనం నిర్మించడమా? వేలమంది ప్రజల సంక్షేమం ముఖ్యమంటుంది ప్రభుత్వం. కాదు నా ఆరాధనా భావం ముఖ్యమంటుంది ముసల్ది. నేను ముసలిదాన్ని వెనకేసుకొచ్చాను. శాస్తి జరిగింది. ముసలిదాన్నీ తృప్తిపరచలేదు. వారి అసంతృప్తినీ చూరగొన్నాను కాని నాకు మనం ఎవరికోసం చేస్తున్నామో, వారికి మన ప్రయత్నం తెలీకుండా వుండడంలో గొప్ప ఆనందం వుంది. రా వెడదాం."

ఇద్దరం పనిమీదికి బైలుదేరాం. తిన్నగా వెళ్ళి ఇద్దరం చెరో బండమీద కూర్చున్నాం. రాత్రి ఏడైంది. చెట్టుకొమ్మలమధ్య చందమామ ఉయ్యాలలూగుతున్నాడు. కదుల్తున్న ఆకులమధ్య నీడలు దోబూచు లాడుతున్నాయి. దూరంగా కప్పలు, దగ్గరగా కీచురాళ్ళు, ఆకాశంలో నక్షత్రాలు చేస్తున్న గానంలా వినిపిస్తాయి కీచురాళ్ళు. గుడిసె లోపల్నుంచి. నల్ల మేఘంలో మెరుపులా వచ్చింది విదురమ్మ, మంచంమీద వాలింది.

"తెచ్చారా ప్రభువులు?" అంది మామయ్యకేసి చూస్తూ.

"ఇదిగో" అని ఆ పొట్లం ఆమెకి అందిచ్చాడు మామయ్య.

"ఇదుంటే ఇంకేమీ వద్దులెండి" అన్నది విదురమ్మ. నవ్వుతూ వాడిన పుష్పం

రేకులలా విప్పుకున్నాయి ముడతలన్నీ. లోపలి హరికేన్ దీపం వెలుగు జుట్టు ముడిమీద పడింది తెల్లత్రాచు పిల్లలా చలికి చుట్టుకు పోయిన ముడిలో వెంట్రుకలు గాలికి ఆడిపోతున్నాయి. రగ్గు కప్పుకుంది.

మందంగా వున్న రగ్గు రగ్గే ఆమెని కప్పుకున్నట్లుంది. ఆ చీకటి వెలుగు నీడలలో అంత పల్చగా కనబడుతోంది. మామయ్య తెచ్చిన నల్ల మందుతో పదిపోనులు పెరిగినట్లుంది రగ్గు బాగా దగ్గరకు లాక్కుని, మంచం ముందుకు లాగబోయి బోర్లపడింది. దగ్గు ఆమెను కుంగదీసింది. పేరమ్మ, పాలేళ్ళు లేవదీశారు.

"ఈ స్థితిలో ఎట్లా చెప్తావు మామయ్యా?" అన్నాను మెల్లగా.

"నిజమే, చెప్పక తప్పదు. చూడు విదురమ్మా...."

"నాకంత చెముడు లేదులెండి."

"వినమనలేదు చూడమన్నా."

"కనబడతానే వున్నారు అదుగో మా బండమీద ప్రభువులు నా కంత చెత్వారం లేదులెండి–"

"నాకు రెండూ కాస్త కాస్త వున్నాయి అందుకే బిగ్గరగా మాట్లాడి, ఎత్తుగా కూర్చుని, పరీక్షగా చూస్తున్నాను. తమ్మయ్యచేత మొన్న కబురంపావు బండలు మూలగా పడేసి కట్టుకోమని. గవర్నమెంటువారు, నీకంత కష్టంగా వుంటే వద్దన్నారు" అని ఆగాడు మామయ్య.

"మహరాజులా కట్టుకోండి...."

"కట్టడంలేదు మానుకుంటున్నాం."

"ఎందుచేత?"

"నీకంత కష్టం ఎందుకని?"

"అంత కనికారం ఎందుకండీ? ముసల్ది రేపో మాపో చస్తుంది ఆపైన కడదామనా నే చావనండోయ్. వచ్చే దాన్నైనా తే ఆడితోనే చద్దును. మరో పదేళ్ళదాకా చావను. నిక్కచ్చి, ఇంకా అబద్దమేమో పేరమ్మ నడగండి" అని తనే నవ్వుకుంటోంది. ఏడ్పుకీ, నవ్వుకీ, ఒకే రకం వంకరలు తిరిగిన మోహం ఆమెది. ముసిలిదేడిస్తే కన్నీరు కనబడదు. నవ్వితే వినబడదు.

"అయితే నీ కభ్యంతరం లేనట్లేగా."

"లేదు. చెట్టుమాత్రం ముట్టకండి."

"అది కొట్టివేయించకుండా పని జరగదు" అన్నాడు మామయ్య.

"అసలు ఆ చెట్టులో విశేషం ఏమిటి? అని మధ్యలో సాహసించి నేనూ ఓ ప్రశ్న అడిగా.

"ఏముంటుందండి, విత్తనం, మొక్క, మాను, చెట్టు, ఆకులు, పూలు, మనిషికి మల్లేనే గాలికి వూగుద్ది, ఆకులు పోతాయి మాను విరుగుతుంది. మనిషల్లే చస్తుంది. నే హరీమనంగానే దాన్ని పీకించండి."

హిస్టీరియా తాలూకు ప్రలాపనలా తోచింది ఆ సమయంలో. నేనేమీ అనలేదు ఏమనాలో తెలీక.

"నిజమే విదురమ్మా! ఆ చెట్టు కూల్తుంది. కాని మరో చెట్టు మొలుస్తుంది. మరో మనిషి పుడతాడు. అలా జరిగి పోతూంటుంగి సృష్టి. పాతచెట్టు అలా నిలిచిపోతే,

కొత్తవి లేచేటందుకు అసలు చోటే వుండదు మరి అంచేత దాన్ని తీయించివేద్దాం ఒప్పేసుకో" అన్నాడు మామయ్య.

"ఆ ఇది ఒప్పుకోకపోతే మహా ఆగుద్దా. 'వూ' అను పిచ్చిదానా" అని పేరమ్మకూడా ఓ మాట పడేసింది.

"ఎప్పుడు పీకిస్తారు?"

"ఎల్లుండి ఉదయం మంచిరోజు పునాదులు తీస్తారు."

"ఇంక ఆగరన్నమాట."

"ఏం దాగేది నీ ఎర్రి.

రేపటెల్లుండిలో ఏ మొచ్చిందీ ఏదం?" అని పేరమ్మ కరుకుగా మందలించింది.

"అమ్మో....." అని స్పష్టంగా రోదిస్తోంది విదురమ్మ. కీచురాళ్ళ నాదం స్థాయి హెచ్చింది. గాలివడి పెరిగింది ఆకులు దట్టంగా రాలుతున్నాయి. రాతిబండలు వేడిగాలిపీల్చి, చలిగాలికి వదుల్తున్నాయి. దూరంగా మిణుగుపురుగులు మంద రేగి, అడివి అంచులు ఎర్రగా మెరుస్తున్నాయి. చందమామని మేఘాలు కప్పుతున్నాయి. నక్షత్రాల నాడులు త్వరితంగా కొట్టుకుంటున్నాయి. ఈ ప్రకృతి విజృంభణలో విదురమ్మ రొద కలిసిపోయి, నైసర్గిక స్థితిలో పరిణమించింది.

* * *

శెలవులైపోయాయి, ఇంక రేపోమాపో బైలుదేరాలి. విదురమ్మను గురించి నా కుతూహలం కూడా తగ్గింది. ఆ బండలు తొలగిస్తారు. చెట్టు నరుకుతారు. విదురమ్మ అంగీకరించింది. ఒక విషయం పరిష్కారమవగానే దానిపట్ల కుతూహలం సన్నగిల్లుతుంది. నిజమే కాని అలాకాక మరోలా పరిష్కారం అయితే బాగుండుననిపిస్తుంది ఎందుకో. ఇంట్లో దొంగలడ్డారంటే నలుగురూ కుతూహలం చూపెడతారు. కాని వాళ్ళు ఏ వస్తువూ దొంగిలించ కుండా వెళ్ళిపోయారంటే, ఏవో అసంతృప్తి వుండనే వుంటుంది. ఏమీ దొరక్క ఒక చీపురుకట్ట తీసుకుపోయారని విన్నా, కొంత తృప్తిగా వుంటుంది. ఏదో జరగడం కోరుతుంది మనస్సు. అంతరంగంలో ఎన్నెన్ని మార్పులొచ్చి ఎన్నెన్ని తత్వాలు తారుమారైనా ప్రవర్తనద్వారా స్థూలజగత్తులో ఏదో సంభవిస్తేగాని, ఆ చర్య జీవితంలో ఒక భాగం కాదు. విదురమ్మ విషయంలో నిరుత్సాహపడినా, అంత అసంతృప్తి నాలో లేదు.ఆమె ఒకప్పుడు తీవ్రంగా ప్రేమించింది. మధ్యలో మృత్యువచ్చి, ఆమె జీవితాన్ని తుంచివేసింది. మనస్సులో, వూహలో గతంలో ఆమె జీవిస్తూ, ఆ ప్రేమ బంధనాలని ఇంకా మోస్తూ తన జీవిత విధానానికి పరిపూర్ణతని ఆపాదించడానికి కడసారి యత్నం చేసింది. అది ఫలించలేదు. రాళ్ళురప్పలు, ఆకు అలమ, బెండుబెరడు ఈ చిహ్నాలను నిర్మూలనంచేసి, వాటి రసాన్ని తన గుండెల్లోకి లాక్కుని రక్తంలో కలుపుకొని ఏకాంతంగా జీవించాలి.

ఆ సాయంత్రం ప్రయాణం. మధ్యాహ్నానికి అర్జంటుగా బట్టలు తెమ్మని చాకలికి చెబుదామని బైలుదేరాను. రెండు మూడు ఫర్లాంగులు వెళ్ళగానే కనిపించాడు చాకలి. బట్టల విషయం చెప్పాను. నవ్వాడు. తను తమ్మయ్యకాడుట. తమ్మయ్యా తమ్ముడు వీరన్నట. అచ్చంగా అన్నయ్యలాగే వున్నాడు వీరన్న. కవలపిల్లలు కారట. ఇద్దరికీ నాలుగేళ్ళు ఎడం.

"చెప్తాలెండి- మద్దినాళకి బట్టలు తెమ్మని" అన్నాడు వీరన్న.

వీరన్నపని ఇస్త్రీ చెయ్యడం మట్టుకే, ఉతకటం అన్నయ్య పనిట. మిగతావేళల్లో 'బ్లాక్' లో కూలిపని చేస్తాడుట.

"పునాదులు తవ్వుతున్నారా?" అని అడిగా.

"నిన్న టేల పనిలో కెళ్ళలేదండి. సంతకి పై వూరెళ్ళానండి" అన్నాడు.

"విదురమ్మ ఇంటిముందు చెట్టు ఎందుకేనా పనికొస్తుందా?"

"ఎవరికండి? ముసలిదానికా దాన్ని తగలెయ్యడానికి కూడా పనికి రాదండి. ఆ చెట్టుకి చేవలేదండి. అబ్బో ఏనాటిదో. పదేళ్ళక్రితం పెద్ద గాలివానొచ్చిందండి. అంతా నీళ్ళమయం. గుడిశెలు తూలాయి– ఓ జలమయం. అందరం ఆ దిబ్బలమీదికి పరుగెత్తాం. సెట్టుకాడే కూకుందండి విదురమ్మ. ఆ దిరిగిపడి సత్తావే. లేచిరా అని బలవంతాన గుంజాక విడిపించి దాన్ని లాక్కుపోయినామండీ. సిత్రం, ఆ సెట్టుమటుకు పడలేదండి. ఓ అరడజను కొమ్మలూడాయి. ఆకు ఒక్కటీలేదు. మోడు మిగిలిందండి. కాని ఈ దఫా ఆకులు రంగు పచ్చగా లేదండి. గోధుమరంగులో ఆకట్టింది. అంటే సేవ సచ్చిందన్నమాటే కదండి. సింతసచ్చినా, పులుపు సావ లేదన్నట్లుందండి."

వీరన్న వాక్యం పూర్తికాలేదు. మరో వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి అతని భుజం చరిచాడు. వీరన్న అదిరిపడ్డాడు.

"విదురమ్మ తెల్లారగట్ల సచ్చిపోయిందట. ఇప్పుడిప్పుడే తీసుకెళ్ళారు" అన్నాడు. అందరం గబగబా విదురమ్మ గుడిసెకేసి నడుస్తున్నాం. వాళ్ళు పరుగెడుతున్నారు. నేను కొంచెం వెనకపడ్డా. విదురమ్మ కథ సమాప్తమైంది. నా ఆలోచనలు కూడా నిలిచిపోయాయి. మృత్యువు ముందు మనిషి వూహ నిలబడలేదు. తర్కం, తత్వం నైతికచింతన, మంచి చెడ్డల తీర్పు– వీటికింక తావులేదు. ఉంది– లేదు.

జనం పల్చబడ్డారు. కొందరు వెనక్కి వచ్చేస్తున్నారు. పేరమ్మ గొడ్ల దగ్గర సర్దుతూంది. రాతిబండలు అలానే వున్నాయి. కాని వాటిమధ్య చెట్టు పడిపోయింది. కొమ్మలన్నీ విరిగి పడివున్నాయి. చెట్టుమొదట్లో కొన్నివ్రేళ్ళు వూడల్లా వంకరలు తిరిగి పడున్నాయి. కొన్ని నేలమీదినుండి పొడుచుకొని నిలబడ్డాయి. వాటిపక్కన రెండడుగుల్లలోతుగల కన్నం కనిపిస్తూంది. అందుల్లోంచి మట్టిపురుగులు దోవ తెలీక పెనుగుల్లాడుతున్నాయి. సన్నటి ఎర్రకంకర– నల్ల బంకమట్టి తేమలేక పొడిపొడిగా వుండలుగా చెట్టు మొదల్లుచుట్టు పడివుంది. ఇది కూలీలపనా? పేరమ్మ వచ్చింది. వీరన్న బండమీద కూర్చున్నాడు. నేను మరో బండమీద కూర్చున్నాను.

"ఇయాళ మంచిరోజే – నచ్చింది పుణ్యం తెచ్చుకుంటుంది. అదృష్టవంతురాలే...." అంది పేరమ్మ కొంగుతో మొహం తుడుచుకుంటూ. కన్నీరు నిలిచిపోయింది. పేరమ్మ నవ్వుతోంది.

"ఏడిచే వాళ్ళెవరూ లేరుగందా" అంది.

"ఎందుకేడవడం?" అన్నాడు వీరన్న.

"అదీ నిజమేలే. కూతురు, కొడుకు బ్రతికుండగా ఓమారొచ్చి చూసినపాపాన పోలేదుగా!"

"పోయినప్పుడు ఎవరున్నారు?" అన్నాను.

"సిత్రమైన సావు చచ్చిందిలెండి."

"చెప్పు....?" అన్నాడు వీరన్న.

"నేను పెరటివేపుగదిలో బస్తాలకాడ పడుకున్నా. తెల్లవారగట్ల కోడి కూసింది. పెద్ద సప్పుడైంది. బస్తాలు మీదపడుతున్నాయనుకుని పెద్ద కేకేసి లెగిసా. ఆ మట్టున పెద్దకేక 'అమ్మో సచ్చా' నంటూ వినబడ్డది. మతోయి వాకిట ముంగలికి ఉరుకున ఎళ్ళిపడ్డా. సూసేతలికి విదురమ్మ పడుంది చెట్టు కూలింది. విదురమ్మ చేతిలో అట్లకాడుంది. వంకరోయి పడుంది. అది ఆయాసపడతావుంది. లబోదిబోమని కేకలెట్టా. ఆయాసంతోనే నాలుగు మాటలు చెప్పింది విదురమ్మ. చెట్టు తనే తవ్విందట. చెట్టు కింద మొగలో మట్టిలో ఉంగరం కప్పెట్టి ఉంచిందట. దానికోసం తవ్విందట. ఆ ఉంగరం వేలుకెట్టమని 'అది మాత్రం తీయకండి. దాంతోటే ఛస్తా-' అని రాణిలా నా చేతుల్లోనే ప్రాణం విడిచిందండి" అని చెప్పడం నిలిపివేసి మొహం తుడుచుకొంటోంది పేరమ్మ.

"ఉంగరం ఎందుకు కప్పెట్టిందంటావ్?"

"ఏమో, మొగుడిది కాబోలు దాచుకుంది. మొగుడంటె భలే ప్రాణంలెగండి స్వర్గానికెడుతుంది నా ఎర్రి విదురమ్మ. దానికింక జన్ముండదు...." అంటూ లోపలికెళ్ళింది పేరమ్మ.

"ఇదుగో సూడండి" అని ఛివాలున లేచాడు వీరన్న....నేను ఉలిక్కిపడ్డాను. ఆ చెట్టుపాతిన కంతలోంచి ఏ పామో వచ్చి పడిందనుకొని.

"చూడండి."

లేచి చూశాను. నే కూర్చున్న బండమీద కింద భాగంకేసి చూపిస్తున్నాడు వీరన్న. ఒంగి చూశాను. మట్టి తవ్వెయ్యగా బైటపడ్డ రాయిలో భాగం. అడుగు లోతుగా మట్టితవ్వితే దానిమీద ఏనాడో చెక్కిన అక్షరాలున్నాయి. గుడ్డతో తుడిస్తే స్ఫుటంగా కనబడ్డాయి. 'ఇంద్రన్న' అన్న పేరులో అక్షరాలు.

"ఇంద్రన్నెవరు?"

"ఆడేనండి, చెట్టుపాతినోడు. ఆడో పనిలో కుదురుకుండాడండి. నేను ఓ దఫా చూశాను. నల్లసిద్ధిలాగుంటాడు. కసరత్తుచేసి ఫైలమాన్ లాగుంటాడండి. మంచి ఛాతి, వెంట్రుకలు అయ్యాలేవు. ఉక్కుకడ్డీలాంటి జబ్బలు ఎత్తుగా దర్జామీసం. మళ్ళా ఏడకో పోయాడు. చచ్చాడంటారు. మళ్ళా రాలేదుగా."

"భర్తపేరు భద్రంగా...." అన్నాను.

"ఈడుంకోడు. ఆడు సచ్చినాక యీడు. వీడే ఉంగరం ఇచ్చాడు. మరెందుకో ఇష్టం కామోను చెట్టుకింద పాతాడు. దానిపైన చెట్టు పాతి మొలిపించాడు. గవర్నమెంటోరు చెట్టు నరికేస్తారు. సాయంత్రానికి అని తెలుసుకుంది. ఉంగరం దక్కించుకుందామని రాత్రికాడ లేచి తవ్వింది. చెట్టు కూలింది. ఉంగరం ఏలికి పెట్టింది. ఆయాసం పుట్టి సచ్చింది" అని లేచాడు వీరన్న.

ఇన్నాళ్ళూ విదురమ్మ కథ ఓ ఆకృతిగల తివాచీలాగు తోచినా, అందులో కొన్ని రంగులపోగులు లోపించినట్లయింది. ఇవి విన్నతర్వాత ఆ నమూనాలో లోపించిన పోగులు అమిరాయి ఇప్పుడు పూర్తయింది. ఆమె జీవితం గీసిన చిత్రపటం. మృత్యువు దానికి ఫ్రేముకూడా తగిలించినట్లుంది. ఆ సాయంత్రం ప్రయాణం అవుతుంటే మామయ్య అన్నాడు. "భర్తని ఆరాధించింది. ఆ గదంతా భర్తదే.... ఇంద్రన్న ప్రియుడేమో- మట్టిలో కప్పెట్టింది. అంటే ఆరాధించలేదన్నమాట. భర్తపట్ల ఆమెకున్న సెంటిమెంట్స్‌ని

అందుకే మనం కటాక్షించాలని అధికారులకి సలహా ఇచ్చాను. వారు విన్నారు కాదు" అన్నాడు మామయ్య నవ్వుతూ. కాని బండి కదుల్తూంటే నాకేసి చూసి కన్ను మెదిపినట్టనిపించింది. మామయ్య వింతయైన మనిషి. అందుకే ఇష్టం నాకు.

* * *